క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, జయభేరి పైన్‌వ్యాలీ, సన్‌షైన్ ఆస్పత్రి పరిసరాలు, టింబర్ లేక్‌కాలనీ, మధురానగర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ప్రాంతం, ప్రశాంత్‌హిల్స్, దివ్యశ్రీ, షాగౌస్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నానక్‌రాంగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

నానక్‌రాంగూడ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ, సుమధుర అపార్ట్‌మెంట్స్ ప్రాంతం, శ్రీరామ స్కూల్ పరిసరాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

విద్యార్థులకు సన్మానం



మాదాపూర్: జేఈఈ మెయిన్స్–2023లో 99శాతంతో టాప్ స్కోర్ సాధించిన రెసోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. రెసోనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన 22 మంది విద్యార్థులు పరీక్షలో 99శాతం స్కోర్ సాధించారని తెలిపారు.

గీతంలో 10న వర్క్‌షాపు

పటాన్‌చెరు టౌన్: గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ) ఆధ్వర్యంలో ఈనెల 10న 'ఆర్ ప్రోగ్రామింగ్ అండ్ పైథాన్'పై ఒకరోజు వర్క్‌షాపునిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు రవితేజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఫిషన్ ల్యాబ్స్ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అంజనా నారాయణ శిక్షకురాలిగా పాల్గొంటారని తెలిపారు. తొలి ప్రాధాన్య పద్ధతిలో, కేవలం 60 మంది విద్యార్థులు మాత్రమే పాల్గొనే వీలుంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు శ్రీనివాస్ 9948546893/95428 95896లో సంప్రదించాలని సూచించారు.

రైతుబీమా చెక్కులు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో ఇటీవల మృతి చెందిన రైతులు అరవింద్‌రెడ్డి, భిక్షపతి కుటుంబాలకు ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌లు మంగళవారం రైతుబీమా చెక్కులను అందజేశారు. ఈ పథకంలో మంజూరైన రూ.5 లక్షల చెక్కులను మృతుల కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రమాబాయి జయంతి

మియాపూర్ : మియాపూర్‌లోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ అంబేడ్కర్ రమాబాయి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి పార్టీ అధ్యక్షులు పార్నంది రాములు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు శ్యాం కిరణ్, చిన్న, మనోహర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రకీబ్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి అబ్దుల్ రకీబ్‌కు మంగళవారం పీహెచ్‌డీ ప్రకటించారు. ఇస్లామిక్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మహ్మద్ ఇర్ఫాన్ అహ్మద్ పర్యవేక్షణలో ప్రఖ్యాత ఉర్దూ ఖురాన్ మరియు వాటి పద్ధతుల అధ్యయనం' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

తెలుగు సినిమాదే హవా...

సాక్షి, సిటీబ్యూరో: గత ఏడాది దేశంలోనే అత్యధికులు ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసిన సినిమాగా 'పుష్ప' నిలిచింది. బాలీవుడ్ కు చెందిన బ్రహాస్త్ర, ది కాశ్మీర్ ఫైల్స్ ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. అమెజాన్ ఫైర్ టీవీ తాజాగా విడుదల చేసిన అధ్యయన ఫలితాలు ఈ విషయాలను వెల్లడించాయి. నగరంతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న ఆన్‌లైన్ వినియోగదారుల అభిరుచులపై సాగిన ఈ అధ్యయనంలో కామెడీ కంటెంట్‌ను వీక్షకులు బాగా ఇష్టపడుతున్నట్టు తేలింది.ఆ తర్వాత స్థానంలో హర్రర్, కార్టూన్స్ నిలిచాయి. ఉచిత కంటెంట్‌ను అందించే ఆన్‌లైన్ వేదికలలో యూ ట్యూబ్, ఎంఎక్స్ ప్లేయర్, మిని టీవీలు బాగా ఆదరణ పొందాయి.

కబ్జాలో పెద్ద చెరువు

- అమీన్‌పూర్ చెరువులో దర్జాగా నిర్మాణాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అమీన్‌పూర్ పెద్ద చెరువులో నిర్మాణం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అమీన్‌పూర్‌లోని చెరువులు, కాల్వల భూముల్లో హెచ్‌ఎండీఏ వెంచర్లు, నిర్మాణాలు వెలిశాయి. తాజాగా పెద్ద చెరువు అంతర్ధానం అయ్యే పరిస్థితి నెలకొంది. శంభునికుంట దాదాపు కానరాకుండా పోయింది. తాజాగా జీవ వైవిధ్య చెరువుగా పేరున్న అమీన్‌పూర్ పెద్ద చెరువులో అక్రమంగా స్విమ్మింగ్‌పూల్ నిర్మాణాలు మొదలుపెట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో రేయింబవళ్లు మట్టి పోస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

- చెరువు పరిధిలోని పట్టా భూముల్లో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆ భూమి పరిధి అంతా ఇరిగేషన్ వారిదేనని, తాము మాత్రం ఎవరికీ ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని మున్సిపల్ అధికారులు సమాధానం ఇస్తున్నారు. కనీసం అక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయన్న సంగతి కూడా తెలియదని మున్సిపల్ టీపీఎస్ అధికారిని చెప్పుకొచ్చారు. అయితే ఇరిగేషన్ శాఖ అధికారులు మరింత మొద్దు నిద్రలో ఉన్నారు. అలాంటి నిర్మాణం ఎక్కడుందని సాక్షిని ప్రశ్నించారు.
- అమీన్‌పూర్ పెద్ద చెరువు పక్కన ఉన్న ప్రధాన రోడ్డు మీదుగా వెళ్లే ప్రతి ఒక్కరికీ అక్కడ నిర్మాణం జరుగుతుందని, రేయింబవళ్లు మట్టి నింపి చెరువును చెర పడుతున్నారని తెలుసని స్థానికులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

చెరువుల జోలికి వస్తే ఊరుకోం. అమీన్‌పూర్ పెద్ద చెరువులో జరుగుతున్న నిర్మాణాలను ఆపుతాం. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా పెడతాం.

– రామస్వామి, డీఈఈ, ఇరిగేషన్ శాఖ, పటాన్‌చెరు

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్‌లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల ఐఐటీ నీట్ అకాడమీ బాలుర కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్ మొత్తం 101 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందులో 80 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌కు అర్హత సాధించడం విశేషం. మొత్తం 80 మందిలో పది మంది విద్యార్థులు తొంభైశాతం పర్సంటైల్, ఇరవై మంది విద్యార్థులు ఎనభై శాతం పైగా పర్సంటైల్‌ను సాధించారు. అందులో రామకృష్ణ 98.34 పర్సంటైల్, ఏ.రాంరెడ్డి 97.19, బి అనుదీప్ 96.50, జస్వంత్ 96.12, సీహెచ్ నాగరాజు, 94.21, పి లోకేష్ 94.06. బి తేజ 93.01, వివేక్ 90.52 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ పాపారావు, వైస్ ప్రిన్సిపల్ గణేష్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. విద్యార్థులను అభినందించారు.

మెరిసిన గురుకుల బాలికలు

జేఈఈ మెయిన్స్‌లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు ప్రభంజనాన్ని చాటారు. 115 మంది పరీక్ష రాయగా 69 మంది జేఈఈ అడ్వాన్స్‌కు క్వాలిఫై అయ్యారు. నవ్యశ్రీకి 94.6303 పర్సంటైల్, ఏ వర్షా 93.7625, జి నిత్య 92.7988, కె అశ్వినికి 92.6577, సీహెచ్ పింకి 91.8464, ఎస్‌కే గౌసియా 91.5543 పర్సంటైల్‌ను సాధించారు.

ప్రతిభ చాటిన గచ్చిబౌలి క్రీడాకారులు



గచ్చిబౌలి: గచ్చిబౌలికి చెందిన క్రీడాకారులు వారణాసిలో జరిగిన సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటర్ స్కూల్ క్రీడలలో రాణించారు. 2022–23 పోటీలలో గచ్చిబౌలి స్టేడియంలో 1500 మీటర్ల పరుగు పందెంలో 17 ఏళ్ల విభాగంలో మిథిని ప్రథమస్థానం..14 ఏళ్ళ విభాగంలో ప్రీతికరెడ్డి, 800 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం పొందారు. జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గచ్చిబౌలి స్టేడియం కోచ్ శ్రీనివాస్ అభినందించారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని వైట్‌ఫీల్డ్‌లో గల కార్యసిద్ధి వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది.ఎమ్మెల్యే గాంధీ మాజీ కార్పొరేటర్ రవీందర్‌ముదిరాజ్‌తో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, శ్రీరామమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీల సమగ్రాభివృద్ధే లక్ష్యం

శేరిలింగంపల్లి: కాలనీల సమగ్రాభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. గోపీనగర్, నెహ్రూనగర్‌లో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, సీసీరోడ్ల, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జలమండలి మేనేజర్ అభిషేక్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మోహన్, అధికారులు బ్రహ్మం, నవీన్, జగన్ మోహన్, నాయకులు యాదగౌడ్ , పర్వీన్ బేగం ,దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను తగ్గించే వరకు పోరాటం



ధర్నా చేస్తున్న కౌన్సిలర్లు, ప్రజలు

జిన్నారం(పటాన్‌చెరు): పెంచిన ఆస్తి పన్నును తగ్గించే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో పెంచిన ఆస్తి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్నా చేశారు. కౌన్సిలర్లు హన్మంత్‌రెడ్డి, నిహారిక, గోపాలమ్మ, చంద్రయ్య తదితరులు ప్రజలతో కలిసి మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆస్తి పన్నులను పెంచటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెంచిన పన్నులను తగ్గించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మునీర్, శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్య, మోహన్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలాక్సీ ఎస్23 మొబైల్ ప్రీ బుకింగ్ ప్రారంభం



ప్రీ బుకింగ్‌ను ప్రారంభించిన సామ్‌సాంగ్ ఇండియా జనరల్ మేనేజర్ అక్షయ్‌గుప్తా

మాదాపూర్: మాదాపూర్‌లోని నోవాటెల్‌లో ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సాంగ్ గెలాక్సీ ఎస్ 23 సిరీస్ ప్రీ బుకింగ్‌ను సామ్‌సంగ్ ఇండియా మొబైల్ బిజినెస్ జనరల్ మేనేజర్ అక్షయ్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలాక్సీ ఎస్23 సిరీస్ 24 గంటలలో 1,40,000 ప్రీ బుకింగ్స్‌తో రికార్డు సాధించిందన్నారు. అత్యంత వేగవంతమైన మొబైల్ గ్రాఫిక్స్ గెలాక్సీ అందించడానికి ఎస్23 సిరీస్ కస్టమ్ డిజైన్ చేయబడ్డ 8 జెన్2 అని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్‌పై ప్రత్యేక ఆఫర్‌లను అందజేస్తున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 'హాత్ సే హాత్' జోడో యాత్రను మంగళవారం గుమ్మడిదల మండలం రాంరెడ్డిబావి గ్రామం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఆయన సతీమణి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధ ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, నాయకులు ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, నీలమ్మ, సంతోష, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 40 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 37 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ముగ్గరికి రూ.3 వేల చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.


పేదలకు భరోసా సీఎం రిలీఫ్‌ఫండ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 5లక్షల 44 వేల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గాంధీ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బీఆర్‌యస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రావు, చంద్రారెడ్డి, కాశీనాద్ యాదవ్, ఆంజనేయులు, చంద్రమోహన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి



శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని ముస్లిం శ్మశానవాటికలో కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక ఆర్చ్, ప్రార్థనా హాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు అనిల్ రెడ్డి, షౌకత్ ఆలీ మున్నా, వాసుదేవరావు, పెద్ద ఖాజా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రం పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ నాలుగవ ఫేజులోని మల్టీ ఫంక్షన్‌హాలులోని కంటివెలుగు కార్యక్రమాన్ని మంగళవారం మేడ్చల్ జిల్లా మెడికల్ ఆఫీసర్ పుట్ల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ చందర్, సీనియర్ నర్సు రమాదేవి, ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్, కూకట్‌పల్లి బీఆర్‌యస్ నాయకులు గోపాల్ చౌదరి, భవాని, రమాదేవి ఇతర నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యం అవసరం

'ఎస్కీ'లో అట్టహాసంగా 'యత్నిక్ డే'



విద్యార్థులతో డైరెక్టర్ రామేశ్వరరావు, సిబ్బంది

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అట్టహాసంగా 'యత్నిక్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు.గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలోని చాణక్య భవనంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ వారుఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బిఎస్ కృష్ణప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వ్యాపార ప్రపంచంలో విజయం సాధించడానికి కమ్యూనికేషన్, కాంప్రహెన్షన్ చాలా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. చదువుతోపాటు నైపుణ్యాలను నేర్చుకోవడంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యం ఉంటే రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, సోలో డ్యాన్స్, ర్యాంప్‌వాక్ అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి, కార్యక్రమంలో ఏ అండ్ పీ చీఫ్ లక్ష్మీకాంతరావు, విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అందూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గుమ్మడిదల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే అన్నారంలో రూ.18లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. గుమ్మడిదల మండలంలోని గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.125కోట్లను కేటాయించిందని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు నర్సింహ్మారెడ్డి, మురళి, నాయకులు హుస్సేన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జిన్నారం మండలం అందూర్‌లో రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఖదీర్, నాయకులు వెంకటేశంగౌడ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా..



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి తదితరులు

ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, శుభోదయ కాలనీ, ఏఎస్ రాజునగర్‌లలో 1 కోటి 13 లక్షల 90 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించడమే ధ్యేయంగా సాగుతున్నామన్నారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి అని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బీఆర్‌యస్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, ఎర్రబెల్లి సతీష్‌రావు, కార్తీక్‌రావు, హరినాథ్, రాంచందర్, ఆంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

బడ్జెట్.. అంకెల గారడీ

- ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతమాత్రం ఉపయోగకరం కాదని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గోదగోని రవి అన్నారు. మియాపూర్‌లోని ఎంసీపీఐయూ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడ్జెట్ అంకెల గారడీగా ఉందన్నారు. ఫిబ్రవరి 14 నుంచి 20వ తేదీ వరకు కామ్రేడ్ తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 14న మియాపూర్‌లోని తాండ్ర కుమార్ స్మారక స్థూపం నుండి ఎంఏనగర్ వరకు భారీ ర్యాలీ, అనంతరం తాండ్ర కుమార్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలోనాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు అనిల్‌కుమార్, సుకన్య, వనం సుధాకర్, వెంకన్న, మట్టయ్య, తుకారాం నాయక్, రమేష్, తదితరులున్నారు.

ఐఎస్‌బీలో 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్యామిలీ బిజినెస్' సదస్సు



మాట్లాడుతున్న సంజీవ్ బజాజ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లోని థామస్ ష్మిదేని సెంటర్ ఫర్ ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ బిజినెస్‌పై 8వ ఆసియా ఇన్విటేషనల్ సదస్సును 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్యామిలీ బిజినెస్' అనే అంశంపై నిర్వహించారు. 28 మంది ప్రముఖ కుటుంబ వ్యాపార నాయకులు, నిపుణులు తమ అనుభవాలను, సలహాలను సదస్సులో ప్రతినిధులతో పంచుకున్నారు. ప్రధానంగా భారతదేశంతోపాటు శ్రీలంక, నేపాల్ నుంచి వచ్చిన కుటుంబ వ్యాపార సంఘం సభ్యులు సదస్సులో వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కుటుంబ వ్యాపారంలో తదుపరి తరం, నాయకత్వం, పాలనలో మహిళలు, కుటుంబ సంపదను రక్షించడం, వృద్ధి చేయడం,సంక్షోభంలో వ్యాపారాన్ని నిర్వహించడం వంటి అంశాలు పరిగణనలోకి వచ్చాయి. దివంగత రాహుల్‌బజాజ్ అసాధారణ జీవితాన్ని సెలబ్రేట్ చేసేందుకు ఆయన కుమారుడు,బజాజ్ ఫిన్ సర్వ్ లిమిటెడ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ అధ్యక్షులు సంజీవ్ బజాజ్ , ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ బోర్డు సభ్యులు ,రీసెర్చ్ అండ్ ఇన్నోవేసన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్‌రంగ్నేకర్ తో సంభాషించారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్ కాలనీలో బస్తీదర్శన్



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 13వ బ్లాక్‌లో బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. బస్తీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని మార్చాలని కోరారు. బోరు పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు పూర్తికాగానే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నరసింహారెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.